రోడ్డు పనుల పరిశీలన

బాలానగర్‌: బాలానగర్‌ డివిజన్‌ పరిధిలోని నవజీవన్‌ నగర్‌లో వీడీసీసీ రోడ్డు పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి బాలానగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ ఆవుల రవీందర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. నవజీవన్‌ నగర్‌లో దాదాపు అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో భాగస్వాములవ్వాలన్నారు.

ప్లాస్టిక్‌ బ్యాగులను వాడొద్దు



చేతి సంచులను అందజేస్తున్న లయన్‌ కోటిరెడ్డి

మోతీనగర్‌: పర్యావరణానికి హానీ చేసే ప్లాస్టిక్‌ బ్యాగులను వాడవద్దని, చేతి సంచులను మాత్రమే వాడాలని లయన్స్‌క్లబ్‌ హైదరాబాద్‌ పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్‌ లయన్‌ అన్నెం కోటిరెడ్డి అన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో రోగులకు చేతి సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్‌ను నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో ఓబుల్‌రెడ్డి, అమరేందర్‌ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడికి సన్మానం

మోతీనగర్‌: శ్రీవివేకానందనగర్‌ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన బొల్లు శ్రీనివాసరావును బుధవారం అయ్యప్ప సంక్షేమ సంఘం అధ్యక్షుడు లయన్‌ కేల వెంకటరావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు రోణంకి జగన్నాథం, బీఆర్‌ఎస్‌ బీసీ సెల్‌ నియోజకవర్గ అధ్యక్షులు నాగుల సత్యం, నాయకులు నరసింహ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేస్తాం



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్‌ పండాల సతీష్‌ గౌడ్‌

మూసాపేట: డివిజన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కార్పొరేటర్‌ పండాల సతీష్‌గౌడ్‌ అన్నారు. ఫతేనగర్‌ డివిజన్‌ సమతానగర్‌లో బుధవారం జలమండలి మేనేజర్‌ అనిల్‌ కుమార్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో దాదాపు రోడ్డు పనులు పూర్తి అయ్యాయని, కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ నిర్మాణ పనులు మిగిలి ఉన్నాయని తెలిపారు. కమ్యూనిటీహాల్‌ భవనాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు రాజేందర్‌, సతీష్‌ గౌడ్‌, నర్సింహ, కన్నయ్య, భాస్కర్‌గౌడ్‌, భాస్కర్‌రావు, పాల్‌, రాజు, విజయ్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌ కేంద్రాన్ని పున:ప్రారంభించాలి

బాలానగర్‌: జీహెచ్‌ఎంసీ ఫిరోజ్‌గూడ వార్డు కార్యాలయంలో ఆధార్‌ నమోదు కేంద్రాన్ని పున: ప్రారంభించాలని తహసీల్దార్‌కు కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌, సీపీఎం నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌ బాలానగర్‌ డివిజన్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మట్టే ప్రసన్నకుమార్‌, బీఆర్‌ఎస్‌ సహాయ కార్యదర్శి ఖాజా, సీపీఎం మండల కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్‌ మాట్లాడుతూ.. గతంలో వార్డు కార్యాలయంలో ఆధార్‌ కేంద్రాన్ని నడిపించారని, సాంకేతిక సమస్యతో గత సంవత్సరం ఆగస్టులో మూసివేశారన్నారు. అదే వార్డు కార్యాలయంలో ఆధార్‌ ప్రక్రియను పున:ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శివ, రాజు, నాగేందర్‌, శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో జేఎన్‌టీయూలో మెగా జాబ్‌ ఫెయిర్‌

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో ఈ నెల 10, 11 తేదీల్లో మెగా జాబ్‌ ఫెయిర్‌ను నిర్వహించనున్నారు. యూనివర్సిటీ ఇండస్ట్రీ ఇంటరాక్షన్‌ సెంటర్‌తో కలిసి పరావాస్తు క్రియేటివ్‌ ఫౌండేషన్‌, నిపుణ హ్యూమన్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ, హెచ్‌ఆర్‌ కో ఆధ్వర్యంలో జాబ్‌ ఫెయిర్‌ నిర్వహించనున్నారు. 100 కంపెనీలు పాల్గొని సుమారు 10 వేల ఉద్యోగావకాశాలు కల్పించనున్నాయి. పది, ఇంటర్‌, డిగ్రీ, పీజీ, బీ.ఫార్మ్‌, ఎం.ఫార్మ్‌ చదువుకున్న వారు ఉద్యోగానికి అర్హులు. ఐటీ, మేనేజ్‌మెంట్‌, ఫార్మా, కోర్‌, బ్యాంకింగ్‌, ఎఫ్‌ఎంసీజీ, రిటైల్‌ వంటి సెక్టార్‌లలో ఉద్యోగావకాశాలు అందించనున్నారు. ఎటువంటి రిజిస్ట్రేషన్‌ రుసుము చెల్లించనవసరం లేదు. మరిన్ని వివరాలకు 8121212873, 7337373575 నెంబర్లలో సంప్రదించగలరు.

పర్యాటక, ఆతిథ్య రంగాల్లో మంచి అవకాశాలు



రాయదుర్గం: పర్యాటక, ఆతిథ్య రంగాల్లో మంచి అవకాశాలు ఉంటాయని రాష్ట్ర పర్యాటక శాఖ సంచాలకులు, నిథమ్‌ డైరెక్టర్‌ ఇలాత్రిపాఠి స్పష్టం చేశారు. బుధవారం 'నిథమ్‌'లో 'పర్యాటక టౌన్‌హాల్‌' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ నైపుణ్యం ఉన్న వారికి మంచి అవకాశాలు ఉంటాయన్నారు. రాడిసన్‌ గ్రూప్‌ సౌత్‌ ఆసియా జనరల్‌ మేనేజర్‌ సందీప్‌జోషి మాట్లాడుతూ పర్యాటక, ఆతిథ్య పరిశ్రమ కఠినమైందని, కానీ ఎదుగుదలకు కూడా అవకాశం ఉంటుందన్నారు. తాను జీఎం కావడానికి 15 ఏళ్లు పట్టిందని, నేడు ఏడేళ్లలోనే ఆ స్థాయికి చేరుకోవచ్చన్నారు. నేర్చుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నోవాటెల్‌ కన్వెన్షన్‌ సెంటర్‌ జనరల్‌ మేనేజర్‌ రూబిన్‌ చెరియన్‌ మాట్లాడుతూ ఈ రంగాలు మహిళలకు ప్రత్యేకమైన వన్నారు. తాజ్‌కృష్ణ జనరల్‌ మేనేజర్‌ పంకజ్‌ సంపత్‌ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే శ్రమించే తత్వం, ప్రతిభావంతులకు మంచి అవకాశాలు వస్తాయన్నారు. అనంతరం ప్రశ్నోత్తరాల సమయం నిర్వహించారు. నిథమ్‌ ఇన్‌చార్జీ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ ఎం కే గణేష్‌ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ విజయలక్ష్మి, మిషెల్లీ జే ఫ్రాన్సిస్‌, ఇతర ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, ఎంబీఏ, బీబీఏ, బీఎస్సీ విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్యానికి చేరువలో.. వనమహోత్సవం

'స్వచ్ఛదనం-పచ్చదనం'తో లక్ష్య సాధన దిశగా...

- గ్రామాల్లో ఊపందుకున్న మొక్కలు నాటే కార్యక్రమం
- పురపాలికలు, ప్రభుత్వ శాఖల్లో వనమహోత్సవంపై నిర్లక్ష్యం



మేడ్చల్‌ జిల్లా టార్గెట్‌ 63.70 లక్షలు

ఇప్పటి వరకు నాటింది 78.44 %

గ్రామాల్లో మాత్రం 7.76 %

సాక్షి, సిటీబ్యూరో: పచ్చదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'వనమహోత్సవం' కార్యక్రమం మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో లక్ష్యానికి చేరువలో ఉంది. జిల్లా యంత్రాంగం నిర్దేశించిన లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేసేలా 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో విస్తృతంగా మొక్కలు నాటడంపైనే కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ఆ ముందుకు సాగుతోంది. పండుగలా వనమహోత్సవం కార్యక్రమం కొనసాగేలా ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలను భాగస్వాములను చేయాలన్న కలెక్టర్‌ ఆదేశాల అమల్లో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు ప్రత్యేక దృష్టితో చర్యలు తీసుకుంటున్నాయి.

క్షేత్ర స్థాయి పరిస్థితులు ఇలా..

ప్రకృతి సమతుల్యత పర్యావరణ పరిరక్షణతోనే సాధ్యపడుతోంది. సమృద్ధిగా వర్షాలు కురవాలంటే సాధారణంగా అటవీ విస్తీర్ణం కనీసం 33 శాతం ఉండాలని అటవీ శాఖ పేర్కొంటున్నా జిల్లాలో మాత్రం పరిస్థితి విరుద్ధంగా ఉంది. ఈ లోటును అధిగమించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలోనే జిల్లా వ్యాప్తంగా 63.70 లక్షల మొక్కలను నాటాలని టార్గెట్‌గా పెట్టుకుంది.

- జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థతోపాటు వివిధ ప్రభుత్వ శాఖలకు మొక్కలు నాటే లక్ష్యాలను అధికార యంత్రాంగం ఖరారు చేయగా ఇప్పటి వరకు 49.96 లక్షలు (78.44 శాతం) మొక్కలను నాటారు.
- మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో పలు పురపాలక సంఘాలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలు వనమహోత్సవంపై నిర్లక్ష్యం చూపుతున్నట్లు తెలుస్తోంది. పురపాలికల్లో అవిశ్వాస తీర్మానాలపై చూపుతున్న శ్రద్ధ వనమహోత్సవంపై చూపటం లేదనే విమర్శలు ఉన్నాయి.
- జిల్లాలో రెవెన్యూ, పరిశ్రమలు, పోలీసు, ఎక్సైజ్‌, పంచాయతీరాజ్‌ (ఇంజినీరింగ్‌), ఆర్‌ అండ్‌ బీ, విద్యా శాఖ, నీటిపారుదల, పశు సంవర్ధక, వ్యవసాయ, ఉద్యాన శాఖ, శిశు, మహిళా, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖలు మాత్రం ఆడపాదడపా మాత్రమే భాగస్వామ్యం అవుతున్నాయి.ఈ నేపథ్యంలో పురపాలిక సంఘాలు, ప్రభుత్వ శాఖల్లో వనమహోత్సవం విజయవంతంగా కొనసాగాలంటే కమిషనర్లు, ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సి అవసరముందని పేర్కొంటున్నారు.
- రూరల్‌ ప్రాంతంలో వనమహోత్సవ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది.
- వనమహోత్సవంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీ, అటవీ శాఖలు మాత్రమే కీలక పాత్ర పోషిస్తున్నాయి.
- మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలోని 61 గ్రామ పంచాయతీల పరిధిలో వనమహోత్సం లక్ష్యం 12 లక్షలు కాగా, ఇప్పటివరకు 97.76 శాతం మొక్కలు నాటారు. ఘట్‌కేసర్‌ మండలంలోని 11 గ్రామాల్లో 96.99 శాతం మొక్కలు నాటగా, కీసర మండలంలోని 10 గ్రామాల్లో 97.03 శాతం, మేడ్చల్‌ మండలంలోని 17 గ్రామాల్లో 96.38 శాతం, ఎంసీపల్లి మండలంలోని 13 గ్రామాల్లో 98.65 శాతం, శామీర్‌పేట మండలంలోని 10 గ్రామ పంచాయతీల్లో 97.76 శాతం మొక్కలు నాటినట్లు రికార్డులు చెబుతున్నాయి. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు మొక్కలు నాటేందుకు అనుకూల వాతావరణం ఏర్పడటంతో రహదారుల పక్కన, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పారిశ్రామిక ప్రాంతాలు, చెరువు గట్లు, ప్రైవేటు రంగ సంస్థల కార్యాలయాల్లో వెంచర్లు, లే అవుట్లు, ప్రభుత్వ స్థలాలు, శ్మశాన వాటికల్లో మొక్కలను విరివిగా నాటాల్సి ఉంది. ఈ నెలాఖరు కల్లా వనమహోత్సవంలో భాగంగా జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం పక్కా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోంది.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

-ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



రామాలయం వద్ద మొక్కలు నాటిన ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లిలోని రామాలయం వద్ద బుధవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రోజాదేవితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం తులసి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌ తరాలకు మనం ఇచ్చే ఆస్తి పర్యావరణాన్ని కాపాడటమే అని అన్నారు. కార్యక్రమంలో మాధవరం రంగారావు, చిన్న తులసి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలోని శ్రీ వివేకానందనగర్‌లో బుధవారం కార్పొరేటర్‌ సబిహా బేగం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇంటి ముందు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పీ సురేష్‌, సీఓ ప్రసాద్‌, ఎస్‌ఎఫ్‌ఏలు, ఆర్‌పీలు, రామ్‌కి సూపర్‌వైజర్‌ శాంతి, యూబీడీ అధికారులు శ్రావణ్‌, ఎంటమాలజీ సిబ్బంది, శ్రీ వివేకానందనగర్‌ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొల్లి శ్రీనివాసరావు, జ్ఞానేశ్వర్‌, రామ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రోశయ్య, పార్వతమ్మ, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్‌ సబిహా బేగం తదితరులు

రేపు శృంగేరి శారదా శంకరమఠంలో పూజలు

మోతీనగర్‌: మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శారదా శంకరమఠంలో శుక్రవారం జగద్గురు శ్రీ విధుశేఖర భారతీ స్వామి వర్ధంతి సందర్భంగా పూజలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు మోతీనగర్‌ శాఖ ధర్మ అధికారి సీఎస్‌ఆర్‌ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు 8.30 గంటలకు గురువందనం, శ్రీ గురు పాదుకా పూజ, శ్రీ ఆది శంకరాచార్యుల వారి అష్టోత్తర నామార్చన, 9 గంటలకు రుద్ర హోమం, ఆయుష్‌ హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఉదయం 11 గంటలకు బ్రహ్మశ్రీ పశర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ ఆధ్వర్యంలో పరాశర సాంగవేద పాఠశాల విద్యార్థులచే వేద పారాయణ, 12 గంటలకు సువర్ణ భారతి మహోత్సవం సందర్భంగా వేద పాఠశాలకు, వేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, 6 గంటలకు చిరంజీవి శశాంక్‌ బృందంచే సంగీత విభావరి వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

మూసాపేట: మద్యం దుకాణాల్లో జరుగుతున్న అవకతవకలపై చర్యలు తీసుకోవాలని బాలానగర్‌ ఎక్సైజ్‌ సీఐ వేణు కుమార్‌కు బుధవారం యువజన కాంగ్రెస్‌ రాష్ట్ర నాయకుడు జిట్టా సునీల్‌ కుమార్‌ యాదవ్‌ వినతిపత్రం అందజేశారు. వైన్‌ షాపుల్లో సిట్టింగులతో సామాన్య ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న షాపులపై చర్యలు తీసుకోవాలన్నారు.



ఉపాధి ఆధారిత విద్య అవసరం



మాట్లాడుతున్న మాజీ ఐఏఎస్‌ అధికారి డా.జయప్రకాశ్‌ నారాయణ

రాయదుర్గం: దేశంలో ఉపాధి ఆధారిత విద్య అవసరమని, ప్రపంచ వ్యాప్తంగా విద్యాపరంగా మనం అధ్వానంగా ఉన్నామని మాజీ ఐఏఎస్‌ అధికారి, రాజకీయవేత్త డాక్టర్‌ జయప్రకాశ్‌నారాయణ పేర్కొన్నారు. గచ్చిబౌలి హెచ్‌సీయూలోని జాకీర్‌ హుస్సేన్‌ లెక్చర్‌ హాల్‌లో 'యూనియన్‌ బడ్జెట్‌ ఆన్‌ ది బ్రాడర్‌ ఎకానమీ' అనే అంశంపై ఏబీవీపీ హెచ్‌సీయూ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ ఆర్థిక క్రమశిక్షణలో అద్భుతమని అన్నారు. విద్య, ఆరోగ్య సంరక్షణకు మరిన్ని పరిష్కారాలు అవసరమన్నారు. ఐఎస్‌బీ ఫైనాన్స్‌ అసోసియేట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ ప్రసన్నతంత్రి మాట్లాడుతూ మెరుగైన విద్య, నైపుణ్యాలు వంటి దీర్ఘకాలిక చర్యలు ముఖ్యమైనవన్నారు. దేశంలో అసంఘటిత కార్మికులు ఉన్నారని వారికి సానుకూలంగా చర్యలుండాలన్నారు. హెచ్‌సీయూ ఏబీవీపీ అధ్యక్షుడు బాలకృష్ణ ఆధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సాక్షి, ఏబీవీపీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బ్యాగ్‌ కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్‌ శిరీష

విద్యార్థులు చదువులో రాణించాలి

మూసాపేట: విద్యార్థులు మంచి మార్కులు సాధించి చదువుకున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఊరికి మంచి పేరు తీసుకురావాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం కూకట్‌పల్లి వివేక్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కార్పొరేటర్‌ శిరీష బాబూరావుతో కలిసి పుస్తకాలు, స్టేషనరీతో కూడిన బ్యాగ్‌ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలకు ఎన్నో సౌకర్యాలు సమకూర్చామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు కార్పొరేట్‌ స్థాయిలో చదువుకోవాలన్న లక్ష్యంతో తన సొంత నిధులతో బ్యాగ్‌ కిట్లను ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుజన, డివిజన్‌ అధ్యక్షులు ప్రభాకర్‌ గౌడ్‌, నాయకులు శ్రీనివాస్‌, అనిల్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ స్కూల్‌ ప్రారంభం ..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లి మెట్రో వెనుక ప్రీ ప్రైమరీ స్కూల్‌ని ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ జూపల్లి సత్యనారాయణ, సంతోష్‌ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్‌ జ్యోతి

మూసాపేట: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్‌ మూసాపేట సెక్టార్‌ సూపర్‌వైజర్‌ జ్యోతి అన్నారు. బుధవారం తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మూసాపేటలోని హరిజన వాడలో గల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులు, మహిళలు, గర్భిణులు, బాలింతలతో పాటు పలు అంగన్‌వాడీ టీచర్లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ కాలంలో పిల్లలకు డబ్బాపాలు ఎక్కువగా తాగిస్తున్నారని, పిల్లల ఆరోగ్యం చెడిపోవడమే కాకుండా వారు బలహీనంగా పెరుగుతారని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కవిత, సంగీత, శశికళ, పుష్ప, సావిత్రి, సంధ్య, మంజుల, శోభ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో సెల్‌ఫోన్‌ గోదాం దగ్ధం

-రూ.20 లక్షల ఆస్తినష్టం



ఎగిసిపడుతున్న మంటలు

కూకట్‌పల్లి: షార్ట్‌ సర్క్యూట్‌తో సెల్‌ ఫోన్‌ గోదాం దగ్ధమైన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ ఎల్‌ఐజీ 16/11,12 ఫ్లాట్స్‌లో పవన్‌ అనే వ్యక్తి సెల్‌ ఫోన్‌ షాపు నిర్వహిస్తూ ఓ గదిలో సెల్‌ఫోన్‌ స్టాక్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. బుధవారం ఉదయం ఒక్కసారిగా మంటలు రావటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే ఫైర్‌ సిబ్బందికి సమాచారం అందించగా.. వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సెల్‌ఫోన్‌ స్టాక్‌ రూంలో ఉన్న బ్యాటరీల వల్ల షార్ట్‌ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. సుమారు రూ.20 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని కేపీహెచ్‌బీ ఎస్‌ఐ సుమన్‌ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దోమల నివారణకు చర్యలు

– శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



విద్యార్థులు, అధికారులతో కలిసి మొక్క నాటిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ వెంకటేష్‌గౌడ్‌

ఆల్విన్‌కాలనీ: కాలనీల్లో వ్యర్థాలను తొలగించి దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని ఎల్లమ్మ చెరువు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో డీసీ కృష్ణయ్య, కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం చెరువులో దోమల లార్వా నిర్మూలన కోసం ఎంఎల్‌ఓ ఆయిల్‌ బాల్స్‌ను వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాలా క్లీనింగ్‌, వన మహోత్సవం వంటి కార్యక్రమాలు చేపట్టి కాలనీలను సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. చెరువులను సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. చెరువుల చుట్టూ ఫెన్సింగ్‌ ఏర్పాటు చేసి వాకింగ్‌ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. మురుగు నీరు చెరువుల్లో కలవకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణి, ఏఎంఓహెచ్‌ మమత, ఇరిగేషన్‌ ఏఈ విశ్వం, ఎంటమాలజీ సూపర్‌వైజర్‌ నర్సింహ, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రవి, కాంగ్రెస్‌ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత వీసీ, అధ్యాపకులను నియమించాలి



ప్రభుత్వానికి బహిరంగలేఖ విడుదల చేస్తున్న ప్రొటెక్షన్‌ ఫోర్స్‌ సభ్యులు, విద్యార్థులు

కూకట్‌పల్లి: యూనివర్సిటీలకు శాశ్వత వీసీ, అధ్యాపకులను నియమించాలని జేఎన్‌టీయూహెచ్‌ ప్రొటెక్షన్‌ ఫోర్స్‌ సభ్యులు, విద్యార్థులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వానికి బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు రాహుల్‌నాయక్‌, పవన్‌కుమార్‌ మాట్లాడుతూ..రాష్ట్రంలోని 10 విశ్వవిద్యాలయాల్లో రిక్రూట్‌మెంట్‌ లేక విశ్వవిద్యాలయాల పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారిందన్నారు. రెండు నెలలుగా రెగ్యులర్‌ వీసీలను నియమించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. 5 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా యూనివర్సిటీలపై దృష్టి సారించాలని కోరారు. విశ్వ విద్యాలయాల ఇన్‌చార్జి వీసీ గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ గెలుపు కోసం పని చేశారని, వారి కనుసన్నలలోనే నడుస్తున్నారన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, సందీప్‌, బ్రహ్మం గౌడ్‌, శివకృష్ణ, విజయ్‌, పిల్లి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగించరు.. ఫాగింగ్‌ చేయరు.!

– రోజురోజుకూ పెరిగిపోతున్న దోమల బెడద



భరత్‌నగర్‌ కాలనీ కూరగాయల మార్కెట్‌లో ఇలా..



మూసాపేటలో ఆటోస్టాండ్‌ వద్ద దోమల బెడద తాళలేక పొగపెట్టిన దృశ్యం

మూసాపేట, భరత్‌నగర్‌ పరిసర ప్రాంతాల్లో దోమల బెడద తీవ్రంగా ఉంది. సాయంత్రం అయిందంటే చాలు దోమలు స్వైర్య విహారం చేస్తున్నాయి. ఎంటమాలజీ సిబ్బంది క్రమం తప్పకుండా ఫాగింగ్‌ చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. చెరువుల్లో గుర్రపుడెక్క పేరుకుపోయి దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయని పేర్కొంటున్నారు. దీంతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భరత్‌నగర్‌కాలనీ ఎల్‌ఐజీలో ఇటీవల డెంగీతో ఓ పాప మరణించిన సంగతి తెలిసిందే. అయినా అధికారుల్లో ఎలాంటి చలనం రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కింది స్థాయి అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదని జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌ అయినా తమ గోడును పట్టించుకోవాలని కోరుతున్నారు. – మూసాపేట

కామిని చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క

